గురుకుల విద్యార్థి మృతిపై దుమారం

మొదటిపేజీ తరువాయి...

బాధ్యత వహించాలంటూ అటు బాధిత తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగాయి. ప్రశాంత్ మృతికి కారణమైన గురుకులాల రీజినల కోఆర్డినేటర్‌ను సస్పెండ్ చేయాలంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తూ బుధవారం పాఠశాల ప్రాంగణంలో ఆందోళనకు దిగారు. ఫుడ్ పాయిజన్ ఘటనను గోప్యంగా ఉంచి, అరకొర వైద్యం అందించడం వల్లే ప్రశాంత్ ప్రాణాలు కోల్పోయాడని ఆరోపించారు. బాధిత కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం ఇవ్వడంతో పాటు రూ. 20 లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. బుధవారం కూడా పాఠశాలలో ఆరు గురు విద్యార్థులకు అరకొర వైద్యం అందించడం కనిపించిందని ఆగ్రహం వ్యక్తంచేశారు.

భువనగిరి బాలుర గురుకుల పాఠశాల ముందు ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు

407మందిలో 26మందికే అస్వస్థత

భువనగిరి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 407మంది విద్యార్థులు ఉంటే వారిలో అస్వస్థతకు గురైందని 26 మందేనని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ప్రకటించింది. ఆరో తరగతి విద్యార్థి ప్రశాంత్ మృతి విచారకరమని, అతడి అంత్యక్రియలకు రూ. 20 వేలు అందించినట్టు తెలిపింది. బాధిత కుటుంబంలో ఒకరికి అవుట్ సోర్సింగ్ ఉద్యోగం ఇస్తామని పేర్కొంటూ సొసైటీ కార్యదర్శి సీతాలక్ష్మి బుధవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదలచేశారు. 12న ఉదయం విరేచనాలతో అస్వస్థతకు గురైన ప్రశాంత్‌కు తొలుత భువనగిరి ఏరియా దవాఖానలో చికిత్స అందించామని, సాయంత్రం ఫిట్స్ వచ్చి అపస్మారక స్థితికి చేరుకోవడంతో వైద్యుల సలహా మేరకు బోడుప్పల్‌లోని మిరాకిల్ దవాఖానకు తరలించినట్టు ఆమె తెలిపారు. పరిస్థితిలో ఎలాంటి మార్పు రాకపోవడంతో మరింత నాణ్యమైన వైద్యం అందించేందుకు 13న రాత్రి జూబ్లీహిల్స్‌లోని రెయిన్‌బో చిల్డ్రన్స్ దవాఖానకు తరలించినట్టు వివరించారు. అక్కడి ఐసీయూలో చికిత్స అందించినప్పటికీ ఆరోగ్యం మెరుగుపడలేదని, 16న రాత్రి బాలుడు మృతిచెందినట్టు ప్రకటించి పోస్టుమార్టం కోసం గాంధీ దవాఖానకు తరలించారని, 17న పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించినట్టు తెలిపారు. పోస్టుమార్టం నివేదిక రావాల్సి ఉందని పేర్కొన్నారు. బాధిత తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు ఎక్స్‌గ్రేషియా కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్టు చెప్పారు.

ఇదే మొదటిసారి

భువనగిరి గురుకులంలో ఎన్నడూ ఇలాంటి ఘటన జరగలేదని, ఇదే మొదటిదని సీతాలక్ష్మి ఆ ప్రకటనలో పేర్కొన్నారు. గురుకులంలో వైద్యశిబిరాలు నిర్వహిస్తూ విద్యార్థుల ఆరోగ్యస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. న్యూట్రిషన్ నిపుణులు సూచించిన ప్రకారం విద్యార్థులకు భోజనాలు ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. గురకులంలో తాగునీరు, ఆహార పదార్థాల నాణ్యతను పరీక్షించేందుకు వాటి నమూనాలను ల్యాబ్‌కు పంపామని, నీటి నాణ్యతలో ఎలాంటి లోపమూ లేదని నివేదిక అందిందని, ఆహార పదార్థాలకు సంబంధించి నివేదిక రావాల్సి ఉందని వివరించారు. నీటి ట్యాంకులు, వంటగది, భోజనాల గది, టాయిలెట్లు, డార్మిటరీలు పూర్తిస్థాయిలో శుభ్రం చేసినట్టు చెప్పారు. ప్రాథమిక విచారణ ఆధారంగా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీరామ్ శ్రీనివాస్‌ను సస్పెండ్ చేశామని, సీనియర్ లెక్చరర్‌ను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా నియమించామని తెలిపారు. పాఠశాల క్యాటరింగ్, శానిటేషన్ కాంట్రాక్టర్లకు నోటీసులు అందించామని పేర్కొన్నారు. పాఠశాలలో 15రోజులు ఉంటూ విద్యార్థుల బాగోగులను పర్యవేక్షించాలని ఓసీడీ ఉమామహేశ్వరిని ఆదేశించామని, ఘటనపై పూర్తి విచారణకు జాయింట్ సెక్రటరీ అనంతలక్ష్మి ఆధ్వర్యంలో పెనేషియా ఓఎస్‌డీ ప్రశాంతి, విజిలెన్స్ ఆఫీసర్ హుస్సేన్‌తో కమిటీ వేసినట్టు వివరించారు. నివేదిక అందిన వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని సీతాలక్ష్మి ఆ ప్రకటనలో తెలిపారు.

ఇండ్లకు వెళ్తున్న విద్యార్థులు

ప్రశాంత్ మృతితో విద్యార్థులు, తల్లిదండ్రుల్లోనూ ఆందోళన మొదలైంది. ఫుడ్ పాయిజన్ నుంచి కోలుకున్న విద్యార్థులతోపాటు ఇతర విద్యార్థులు కూడా ఒక్కొక్కరుగా గురుకులం వీడుతున్నారు. యాజమాన్యం నిరాకరిస్తున్నప్పటికీ తల్లిదండ్రులు లేఖ రాసి గేట్ వద్దనున్న సిబ్బందికి అందించి పిల్లల్ని తీసుకెళ్తున్నారు.

గురుకులాలను పట్టించుకోని రేవంత్ సర్కార్

- విద్యార్థుల ప్రాణాలు పోతున్నా నిర్లక్ష్యం
- బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్

హైదరాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై వివక్ష చూపినట్టుగానే గురుకులాలను కూడా సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. సీఎం వద్దే విద్యా, ఎస్సీ సంక్షేమ శాఖలు ఉన్నాయని, నాసిరకం భోజనంతో విద్యార్థుల ప్రాణాలు పోతున్నా, సమీక్షించడం లేదని మండిపడ్డారు. నల్లగొండ జిల్లాలో భవ్యా యాదవ్, వైష్ణవి ఆత్మహత్య చేసుకున్నారని, తాజాగా ప్రశాంత్ ఫుడ్ పాయిజన్‌తో మృతి చెందాడని పేర్కొన్నారు. భోజన నాణ్యతపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్లతో తనిఖీలు చేయించాలని కోరారు. గురుకులాల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రాపకం కోసమే కోమటిరెడ్డి బ్రదర్స్ ప్రయత్నిస్తున్నారని, లోక్‌సభ ఎన్నికల తర్వాత వెంకట్‌రెడ్డి మంత్రి పదవి పోవడం ఖాయమని ఎద్దేవా చేశారు.

ప్రశాంత్‌ది ప్రభుత్వ హత్యే

భువనగిరిలో జిల్లా సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థి ప్రశాంత్ మృతి ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ హత్యే. సీఎం రేవంత్ రెడ్డికి రాజకీయాలపై ఉన్న శ్రద్ధ, పాలనపై లేదు. బాధిత కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా, ఒకరికి ప్రభుత్వోద్యోగం ఇవ్వాలి.

-కే.వాసుదేవ రెడ్డి, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి

రూ.25 లక్షలు ఇవ్వాలి

రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే విద్యార్థి ప్రశాంత్ మృతి చెందాడు. ఇలాంటి ఘటనలు జరుగుతున్నా సీఎం స్పందించడం లేదు. కాంగ్రెస్ పార్టీకి రాజకీయాలపై ఉన్న శ్రద్ధ విద్యార్థుల బాగోగులు ఆలోచించడం లేదు. బాధిత కుటుంబానికి వెంటనే రూ.25 లక్షలు అందజేయాలి. లేదంటే బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడుతాం.

-తుంగ బాలు, బీఆర్ఎస్వీ నాయకుడు

ప్రశాంత్‌ది ప్రభుత్వ హత్యే

50 లక్షల నష్టపరిహారమివ్వాలి: హరీశ్‌రావు

హైదరాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): భువనగిరి ఎస్సీ గురుకుల పాఠశాలలో విద్యార్థి ప్రశాంత్ మృతి తీవ్రంగా కలచివేసిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఎంతో భవిష్యత్తు ఉన్న ఆ విద్యార్థి.. ప్రభుత్వ అసమర్థత వల్ల మరణించటం దురదృష్టకరమని బుధవారం ఎక్స్ వేదికగా ఆవేదన వ్యక్తం చేశారు. 'కేసీఆర్ పాలనలో ఘనకీర్తి సాధించిన తెలంగాణ గురుకులాలు ఇప్పుడు తల్లిదండ్రులు, విద్యార్థుల నమ్మకాన్ని కోల్పోతున్నాయి. వరుస ఆత్మహత్యలు, ఫుడ్ పాయిజన్ సంఘటనల వల్ల గురుకులాల ప్రతిష్ఠ దిగజారుతున్నది. ప్రజాపాలన అంటూ ప్రతీకార పాలన చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి గురుకులాల్లో చదువుకుంటున్న పేదబిడ్డల సంక్షేమం గురించి కనీస ఆలోచన లేదు. ప్రశాంత్‌ది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే. ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించి బాధిత కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం అందించాలి. ఇలాంటివి పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలి' అని డిమాండ్ చేశారు.

రాష్ట్రం గొంతెండుతున్నది

తెలంగాణ గొంతు ఎండిపోతున్నదని, గుక్కెడు మంచి నీళ్ల కోసం ప్రజలు రోడ్డెక్కుతున్నారని హరీశ్‌రావు తెలిపారు. ఖాళీ బిందెలతో ధర్నాలు చేస్తున్నారని, ట్యాంకర్ల కోసం ఎదురు చూస్తున్నారని వెల్లడించారు. సమైక్య పాలనలోని నీటి కష్టాలు మళ్లీ మొదలయ్యాయని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఇలాంటి దుస్థితి ఎన్నడూ లేదని, మారుమూల తండాల్లోనూ మిషన్ భగీరథ జలధార సమృద్ధిగా వచ్చేదని గుర్తుచేశారు. పంటలకు సాగునీళ్లు ఎలాగూ ఇవ్వని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం.. కనీసం గొంతు తడుపుకోవటానికైనా మంచినీళ్లు ఇవ్వాలని కోరారు.

నేడే లోక్‌సభ నోటిఫికేషన్

మొదటిపేజీ తరువాయి...

రాష్ట్రవ్యాప్తంగా 3.30 కోట్ల మంది ఓటుహక్కును వినియోగించుకోనుండగా, వారి కోసం 35 వేల పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. 1.80 లక్షలమంది పోలింగ్ సిబ్బంది, మరో 25 వేలమంది ఇతర సిబ్బంది, 60 వేల మంది పోలీసులు విధులు నిర్వర్తిస్తారు. రాష్ట్రంలో మొత్తం 17 లోక్‌సభ నియోజకవర్గాలు ఉండగా అందులో రెండు ఎస్టీ, మూడు ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గాలు ఉన్నాయి. లోక్‌సభ స్థానానికి ఈవీఎంపై తెలుపురంగు బ్యాలెట్‌ను ఉపయోగించగా, కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి జరిగే ఉప ఎన్నికలో మాత్రం గులాబీరంగు బ్యాలెట్ పేపర్‌ను ఉపయోగిస్తారు.

నామినేషన్ రికార్డింగ్

నామినేషన్ ప్రక్రియ మొత్తాన్ని రికార్డింగ్ చేయనున్నారు. అభ్యర్థితోపాటు గరిష్ఠంగా ఐదుగురిని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి అనుమతిస్తారు. ఆన్‌లైన్ లోనూ నామినేషన్ వేసుకునే వెసులు బాటు ఉన్నప్పటికీ, ప్రింటెడ్ కాపీని మాత్రం ఆర్వోకు సమర్పించాల్సి ఉంటుంది. ఓటుహక్కు వినియోగించుకునే విషయంలో 85 ఏండ్లు పైబడిన వారికి, దివ్యాంగులకు హోమ్ ఓటింగ్ సౌకర్యం కల్పించారు. రాష్ట్రంలో వీరి సంఖ్య 7.19 లక్షల వరకు ఉంది. మే 8లోపు వీరు ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం ఉన్నది.

బ్యాంకు ఖాతాలపై నిఘా

ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో గురువారం నుంచి ఓటింగ్ పూర్తయ్యే వరకు తనిఖీలు ముమ్మరం చేయనున్నారు. బ్యాంకుల నుంచి లక్ష, అంతకుమించి డ్రా చేసినా, జమ చేసినా ఆ ఖాతాలపై నిఘా పెడుతున్నారు. రూ. 10 లక్షలకు మించి డ్రా చేస్తే ఆ సమాచారాన్ని ఐటీ అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. తనిఖీల్లో దొరికిన డబ్బుకు ఆధారాలు చూపిస్తే మాత్రం వెనక్కి ఇస్తున్నారు.

కంటోన్మెంట్ ఉప ఎన్నిక

లోక్‌సభతోపాటే కంటోన్మెంట్ నియోజకవర్గ ఉపఎన్నికకు కూడా పోలింగ్ జరగనుంది. నియోజకవర్గంలో 2.51 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. 232 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు.

తెలంగాణలో ఓటర్లు

మొత్తం ఓటర్లు	3,30,21,735
పురుషులు	1,64,31,777
మహిళలు	1,65,87,221
థర్డ్ జెండర్	2,737

తెలంగాణలో ఎన్నికల షెడ్యూల్

నోటిఫికేషన్ విడుదల	ఏప్రిల్ 18
నామినేషన్‌కు చివరి తేదీ	ఏప్రిల్ 25
నామినేషన్ల పరిశీలన	ఏప్రిల్ 26
ఉపసంహరణ చివరి తేదీ	ఏప్రిల్ 29
పోలింగ్ తేదీ	మే 13
ఓట్ల లెక్కింపు	జూన్ 4

గులాబీల్లో నయా జోష్

రెండు సభల్లో కేసీఆర్ సింహగర్జనతో ఉత్సాహం

నేడు అభ్యర్థులకు బీఫామ్‌లు, ముఖ్యనేతలకు అధినేత దిశానిర్దేశం

హైదరాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): గులాబీ శ్రేణులు ఉద్యమకాలం నాటి ఉద్వేగానికి లోనవుతున్నాయి. పార్టీ అధినేత కేసీఆర్ తమలో తిరిగి నూతనోత్సాహాన్ని నింపుతున్నారని ఆ పార్టీ నేతలు చెప్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి బీఆర్ఎస్ ఉనికి లేకుండా చేయాలనుకుంటున్న కుట్రలతో అయోమయంలో పడిన క్యాడర్‌కు రెండు బహిరంగ సభలు ధైర్యాన్నిచ్చాయని అంటున్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 13న చేవెళ్ల, 16న సుల్తాన్‌పూర్‌లో బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలను నిర్వహించింది. ఈ రెండు చోట్లా కేసీఆర్ చేసిన ప్రసంగాలు పార్టీ శ్రేణులకు స్పష్టమైన దిశానిర్దేశానికి దారి చూపిందని పార్టీ నాయకులు చెప్తున్నారు. వాస్తవానికి చేవెళ్ల, జహీరాబాద్.. బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాలు. కానీ, సిట్టింగ్ ఎంపీలు ఒకరు కాంగ్రెస్‌లోకి (రంజిత్‌రెడ్డి), ఇంకొకరు బీజేపీలోకి (బీబీపాటిల్) మారి.. ఆయా పార్టీల తరపున పోటీ చేస్తున్నారు. ఇలాంటి వాతావరణంలో సభలు నిర్వహించటం సాధారణ రాజకీయ పార్టీలకు సవాలే. కానీ, బీఆర్ఎస్ అసాధారణ రాజకీయ పార్టీ అని మరోసారి నిరూపించిందని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు.

కాంగ్రెస్, బీజేపీకి దీటైన సమాధానం

రెండు బహిరంగ సభలతో కాంగ్రెస్, బీజేపీకి కేసీఆర్ దిమ్మతిరిగే సమాధానం చెప్పారని బీఆర్ఎస్ కీలకనేత తెలిపారు. గులాబీ పార్టీ ప్రాబల్యాన్ని తగ్గించటం ఎవరి వల్ల కాదని ఈ సభలు నిరూపించాయని వెల్లడించారు. అధికారం లేకున్నా తెలంగాణ ప్రయోజనాలే తనకు ముఖ్యమని కేసీఆర్ మరోసారి స్పష్టం చేశారని, ప్రజల్లో ఆయనకు ఉన్న ఆదరణ ముందు జాతీయ పార్టీలు చిత్తు అవుతాయని వివరించారు. రాష్ట్ర ప్రయోజనాలకు కాంగ్రెస్, బీజేపీ బద్ధశత్రువులని కేసీఆర్ తనదైన శైలిలో వివరించటం వల్ల గులాబీ శ్రేణులు కన్విన్స్ అయ్యాయని, అందుకే సభలకు విశేష స్పందన లభించిందని రాజకీయ పరిశీలకుల విశ్లేషణ.

నేడు అభ్యర్థులు, పార్టీ నేతలకు కేసీఆర్ దిశానిర్దేశం

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గురువారం తెలంగాణ భవన్‌లో కీలక సమీక్ష నిర్వహించనున్నారు. ఎంపీ అభ్యర్థులతో పాటు పార్టీ శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, పార్టీ జిల్లా అధ్యక్షులు, జడ్పీచైర్మన్లు, పార్టీ కార్యవర్గ సభ్యులు, ముఖ్యనేతలు పాల్గొ నే ఈ సమావేశంలో ఎంపీ అభ్యర్థులకు కేసీఆర్ బీఫామ్‌లు అందజేయనున్నారు. ఎన్నికల్లో ప్రచారం, అనుసరించే వ్యూహంపై దిశానిర్దేశం చేయనున్నారు. ప్రధానంగా తాను చేపట్టే బస్సు యాత్ర రూట్‌మ్యాప్‌పై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.

అధికార పార్టీకి తొత్తుల్లా పోలీసులు

నాయకుల మెప్పుకోసం కేసులు

ప్రశ్నిస్తే బెదిరింపులు, బైండోవర్లు • మాధవరావుపై కేసు ఎత్తివేయాలి

డీజీపీకి బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు

హైదరాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని కొందరు పోలీసులు మంత్రులు, ఎమ్మెల్యేల అడుగులకు మడుగులొత్తుతూ వారి మెప్పుకోసం పనిచేస్తూ, బీఆర్ఎస్ కార్యకర్తలపై కేసులు పెడుతున్నారని, అరెస్టులంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారంటూ బీఆర్ఎస్ నేతలు బుధవారం డీజీపీకి ఫిర్యాదుచేశారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్, బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, పార్టీ నాయకులు గట్టు రాంచందర్‌రావు డీజీపీని కలిసి వినతిపత్రం అందించారు. పోలీసులను అడ్డంపెట్టుకుని బీఆర్ఎస్‌ను ఇబ్బంది పెట్టేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నదని వినతిపత్రంలో వారు పేర్కొన్నారు. ప్రభుత్వ విధానాలను విమర్శిస్తే సహించలేకపోతున్నదని దుయ్యబట్టారు. ప్రభుత్వాన్ని విమర్శిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై పోలీసులు అత్యుత్సాహంతో కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. బైండోవర్లు, కేసులు, బెదిరింపులకు పాల్పడుతూ బీఆర్ఎస్ కార్యకర్తల మనోధైర్యాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని తెలిపారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడంటూ కరీంనగర్‌కు చెందిన తమ పార్టీ నాయకుడు, ఉద్యమకారుడు సల్వాజీ మాధవరావుపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టి మానసికంగా వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అధికార పార్టీ నేతలకు పోలీసులు తొత్తులుగా వ్యవహరించడం దురదృష్టకరమని పేర్కొన్నారు. మాధవరావుపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై పెడుతున్న కేసులపై విచారణ జరిపించాలని కోరారు. పోలీసులను మందలించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని వినతిపత్రంలో నేతలు పేర్కొన్నారు.

కమనీయం.. రాములోరి కల్యాణం

భద్రాద్రిలో వైభవోపేతంగా సీతారాముల పరిణయం

- పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన సీఎస్



సీతమ్మవారికి రామయ్య కట్టే తాళిబొట్టు చూపుతున్న అర్చకులు

ఖమ్మం, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): భద్రాద్రి శ్రీసీతారామచంద్రస్వామి వారి కల్యాణం బుధవారం అత్యంత వైభవోపేతంగా జరిగింది. 'శ్రీరామ.. జయరామ.. జయజయ రామ' నామస్మరణతో భద్రగిరి మార్మోగింది. కల్యాణ ఘడియ కోసం రెండు రోజులుగా ఎదురుచూస్తున్న భక్తజనం రాముడిని పెండ్లి కుమారుడిగా, సీతమ్మ తల్లిని పెండ్లి కుమార్తెగా దర్శనం చేసుకొని తరించారు. భద్రాచలంలోని మిథిలా స్టేడియంలో సీతారాముల కల్యాణం నేత్రపర్వంగా సాగింది. భక్తులకు సీతారామ కల్యాణ మహోత్సవాన్ని వీక్షించేందుకు రెండు కనులూ చాలలేదు. అర్చకస్వాముల వేదమంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ నయనానందకరంగా సాగిన స్వామివారి కల్యాణ మహోత్సవం భక్తులను ఆధ్యాత్మిక ఒడిలో ఓలలాడించింది. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన కల్యాణ క్రతువు మధ్యాహ్నం 12:30 గంటల వరకు కొనసాగింది. శ్రీరాముడు, సీతాదేవి వధూవరులుగా ఆశీనులైన మిథిలా స్టేడియం వైకుంఠాన్ని తలపించింది. సీతమ్మ వారికి కల్యాణం రోజు దేశంలో ఎక్కడైనా పుస్తెల తాడులో రెండు సూత్రాలను మాత్రమే ధరింపచేస్తారు. కానీ.. భద్రాచలంలో కల్యాణ మహోత్సవంలో మాత్రం సీతమ్మ వారికి శ్రీరాముడు కట్టే పుస్తెల తాడులో మూడు సూత్రాలు ఉంటాయి. జనక , దశరథ మహారాజులు చేయించిన పుస్తెలతో పాటు రామదాసు సీతమ్మను తన కుమార్తెగా భావించి చేయించిన మూడో సూత్రాన్ని కలిపి రామయ్య తండ్రి సీతమ్మతల్లి మెడలో మాంగళ్యధారణ గావించారు.

పట్టువస్త్రాలు సమర్పించిన సీఎస్

శ్రీరామచంద్రుడికి, సీతమ్మవారికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. టీటీడీ అధికారులు కూడా పట్టువస్త్రాలను సమర్పించగా, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యక్తిగతంగా స్వామి, అమ్మవారికి పట్టువస్త్రాలు అందజేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరసింహన్, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భీమపాక నగేశ్, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రఘునాథ్ తిహారీ, జస్టిస్ శ్రీనివాసరెడ్డి, జస్టిస్ ఎం హరినాథ్, జస్టిస్ మండవ కిరణ్మయి, జస్టిస్ జగడం సుమతి, మల్టీజోన్ ఐజీ ఏవీ రంగనాథ్, భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక, ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్, ఎస్పీ రోహిత్‌రాజ్, మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఆలయ ఈవో రమాదేవి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

నేడు శ్రీరామ మహాపట్టాభిషేకం

గురువారం మిథిలా స్టేడియంలో శ్రీరాముడి మహాపట్టాభిషేకాన్ని నిర్వహించనున్నారు. కల్యాణోత్సవం మరునాడే అదే వేదికపై భక్తుల సమక్షంలో మహాపట్టాభిషేకాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు ఈ వేడుక జరుగనున్నది. పట్టాభిషేక మహోత్సవానికి గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ హాజరై స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

ప్రశ్నించే గొంతుకపై కుట్ర కత్తులు

- సల్వాజీపై నాలుగు నెలల్లో నాలుగుసార్లు దాడులు
- బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జిపై హత్యాయత్నం
- ఉల్టా బాధితుడు మాధవరావుపైనే అట్రాసిటీ కేసు..రౌడీషీట్ ఓపెన్
- కేసీఆర్ ప్రస్తావనతో రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశం
- బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ అధినేత భరోసా

మార్చి 18న కాంగ్రెస్ నాయకుల దాడిలో తీవ్రంగా గాయపడి దవాఖానలో చికిత్స పొందుతున్న సల్వాజీ మాధవరావు (ఫైల్)

పెద్దపల్లి, మార్చి 17(నమస్తే తెలంగాణ)/ ధర్మారం : ప్రజల మాన ప్రాణాలను రక్షించాల్సిన పోలీసులు పక్కదారి పడుతున్నారు. ప్రజాస్వామ్య విలువలకు పాతరేస్తూ, చట్టాలను కాలరాస్తున్నారు. నెత్తుటి గాయాలతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పోలీస్‌స్టేషన్ మెట్లెక్కినా.. ఫాల్స్ కేసు అంటూ కొట్టిపారేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల కాలంలో.. నాలుగు సార్లు దాడులు జరిగినా పోలీసులు స్పందించడం లేదు. కనీసం రక్షణ కల్పించకపోగా దాడి చేసిన వారి నుంచే ఫిర్యాదులు స్వీకరించి ఉల్టా కేసులు పెట్టి పోలీసులు స్వామి భక్తిని చాటుకుంటున్నారు. ఇది నాణేనికి ఒకవైపు మాత్రమే.. మరోవైపు పోలీసులను అడ్డంపెట్టుకొని కాంగ్రెస్ నాయకులు కూడా ప్రశ్నించే గొంతులపై కుట్రలు చేస్తున్నారు. అక్రమ కేసులు బనాయిస్తూ రౌడీషీట్లను ఓపెన్ చేసేలా పోలీసులపై ఒత్తిడి చేస్తున్నారు. దీనికి నిలువెత్తు నిదర్శనమే ధర్మపురి నియోజకవర్గంలో పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి సల్వాజీ మాధవరావు ఉదంతం. కాంగ్రెస్‌కు చెందిన కొంతమంది మాధవరావుపై హత్యాయత్నం చేశారు. ప్రాణాలతో బతికి బయటపడి నెత్తుటి మరకలతో పోలీస్టేషన్ మెట్లెక్కిన మాధవరావుపై అట్రాసిటీ కేసులు పెట్టి, రౌడీ షీట్ ఓపెన్ చేసి జైల్లో పెట్టిన ఘటన సంచలనం సృష్టించింది. ఈ విషయాన్ని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సుల్తాన్‌పూర్ సభలో ప్రస్తావించడంతో రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

మాధవరావుపై హత్యాయత్నం

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రానికి చెందిన సల్వాజీ మాధవరావు బీఆర్ఎస్ పార్టీలో క్రియాశీల కార్యకర్త. ప్రస్తుతం ధర్మారం మండలం బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. కేసీఆర్ పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని సోషల్‌మీడియా వేదికగా ప్రజల్లోకి తీసుకువెళ్తూనే.. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలోని నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ పోస్టులు పెడుతున్నాడు. మార్చి నెలలో ధర్మారం మండలం ముంజంపల్లి, మారేడుపల్లి, శాలపల్లి, బొమ్మరెడ్డిపల్లిలో ఎండిన వరి పంటలను అక్కడి రైతుల అభిప్రాయాలతో సోషల్‌మీడియాలో పోస్టు చేశాడు. అంతకు ముందు రైతుబంధు పైసలు రాలేదని పోస్టులు పెట్టాడు. కాళేశ్వరం జలాలు రాకపోవడం వల్లే కరువొచ్చిందని, మేడిగడ్డలో కుంగిన పిల్లర్లను సాకుగా చూపి సాగుకు నీళ్లివ్వడంలేదని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడు. ఆ తర్వాత మార్చి 18న సాయంత్రం ధర్మారం మండల కేంద్రంలోని తన ఇంటి నుంచి చౌరస్తాలోని ప్రింటింగ్ ప్రెస్ వద్దకు చేరుకున్నాడు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న ఐదుగురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మాధవరావును చుట్టుముట్టారు. మాధవరావు స్కూటీ కీ లాక్కొని ఒక్కసారిగా దాడికి దిగారు. జనం మధ్యనే అందరూ చూస్తుండగానే విచక్షణారహితంగా చితకబాది హత్యాయత్నం చేశారు. తల, మెడ, చేయి, కడుపులో తీ